శ్మశానవాటిక నిర్వహణపై నిర్లక్ష్యం

- అందుబాటులో లేని గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం
- ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- ఎండిపోతున్నా పట్టించుకోని వైనం
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజల ఆగ్రహం


విద్యాధరపురం హిందూ శ్మశానవాటికలో పని చేయని గ్యాస్ ఆధారిత ఫర్నీస్ పరికరాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని హిందూ శ్మశానవాటికపై అధికారులు నిర్లక్ష్యం చూపడంతో నిర్వహణ అధ్వానంగా మారింది. శ్మశానవాటిక ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రీనరీ ఎండిపోయి పిచ్చి మొక్కలు పెరగడంతో చిట్టడవిని తలపిస్తోంది. వాటి మధ్య పాములు తిరుగుతుండటంతో దహనక్రియలు చేసుకునేందుకు వస్తున్న మృతుల బంధువులు, స్నేహితులు బెంబేలెత్తిపోతున్నారు.

మూడు నెలల నుంచి పని చేయడం లేదు

శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం మూడు నెలల నుంచి పని చేయటం లేదని, తప్పనిసరి పరిస్థితిలో కట్టెలపై దహనం చేయాల్సి వస్తోందని మృతుల తాలూకా మనుషులు అంటున్నారు. మృతదేహంతోపాటు దహన సంస్కారానికి వచ్చేవారి కోసం నిర్మించిన రేకుల షెడ్ (వెయిటింగ్ హాల్)పై భాగంలో కొన్ని రేకులు గాలికి కొట్టుకుంటూ పెద్దగా శబ్దం చేస్తున్నాయి. దీంతో షెడ్‌లో కూర్చోలేక చెట్ల నీడన నిలుచోవల్సిన దుస్థితి నెలకొంది. శ్మశానవాటికకు గతంలో ఉండే బోర్డ్ కూడా కనుమరుగైంది. అధ్వానంగా ఉన్న హిందూ శ్మశానవాటిక నిర్వహణపై వీఎంసీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కట్టెలపై దహనం చేసేందుకు నిర్మించిన సీసీ శ్లాబ్


పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తున్న శ్మశానవాటిక ఆవరణ

స్థలాభావ సమస్య ఏర్పడటంతో

కృష్ణానదీ తీరాన పున్నమి హోటల్ పక్కన ఉన్న విద్యాధరపురం హిందూ శ్మశానవాటిక కాలక్రమంలో కుచించుకుపోవడంతో స్థలాభావ సమస్య ఏర్పడింది. దాంతో ఖనన ప్రక్రియను నిలిపివేశారు. ఇక్కడ దహన ప్రక్రియకు మాత్రమే అనుమతిస్తున్నారు. అందుకు బీడు ఐరన్‌తోకూడిన రెండు ప్లాట్‌ఫాంలతో సీసీ శ్లాబ్‌ను నిర్మించారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో (2022 డిసెంబర్) ప్రజాప్రయోజనార్థం 14వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ నిధులు రూ.130.50 లక్షల అంచనా విలువతో ఎల్‌పీజీ గ్యాస్ ఆధారిత దహన ప్రక్రియ కోసం ఫర్నీస్ యంత్రం, వెయిటింగ్ హాల్‌ను నెలకొల్పారు. నాటి స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ప్రారంభించారు. దాంతో నామమాత్ర చార్జీలతో మృతదేహాలను దహనం చేస్తుండటంతో పేద ప్రజలకు ఊరటగా ఉండేది.


ఆవరణలో ఎండిపోయిన మొక్కలు

అందుబాటులో లేని గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం

మూడు నెలల నుంచి గ్యాస్ ఆధారిత దహన ప్రక్రియ నిలిచిపోయిందని, ఆర్థికంగా భారమైనా కట్టెలపైనే దహనం చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేదంటే దూరభారమైనా కృష్ణలంకలో ఉన్న స్వర్గపురి శ్మశానవాటికకు మృతదేహాన్ని తీసుకువెళ్లి అక్కడ ఎలక్ట్రికల్ క్రిమిటోరియంలో దహనం చేస్తున్నామని వాపోతున్నారు. గట్టు వెనుక హిందూ శ్మశానవాటికలో గ్యాస్ ఆధారిత క్రిమిటోరియంలో ఫర్నీస్‌లో సాంకేతిక సమస్య ఏర్పడినా దానిని త్వరితగతిన పరిష్కరించాల్సిన బాధ్యత వీఎంసీ అధికారులది. అయితే అందుబాటులోకి తీసుకురావాల్సిన నగర పాలక సంస్థ అధికారులు నెలలు గడుస్తున్నా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. కోటి రూపాయలకుపైగా ఖర్చు పెట్టి పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం మూతపడటం అంటే సంబంధిత అధికారుల పని తీరు ఎలా ఉందో అర్థమవుతుంది. దీనిపై నగరపాలక సంస్థ ఏఇ శ్రీనివాస్‌ను వివరణ కోరగా పని చేస్తుందని చెప్పడం గమనార్హం.

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో రాజమండ్రికి చెందిన శ్రీలలిత కళాప్రియ నృత్య నికేతన్‌కు చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నాట్యాచారిణి కె.నవ్య పర్యవేక్షణలో 20 మంది చిన్నారులు నాట్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించి వారిని అభినందించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

దుర్గగుడి అధికారులకు అదనపు విధులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో భక్తులకు మౌలిక వసతులు కల్పించడానికి అదనపు విధులు కేటాయించారు. ఈ మేరకు శనివారం ఈవో శీనానాయక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సహాయ కమిషనర్ రంగారావుతో పాటు ఏఈఓలు వెంకటరెడ్డి, తిరుమలేశ్వరరావు, చంద్రశేఖర్, రమేష్‌బాబు, శ్రీనివాస్, కె.గంగాధర్‌కు మహామండపంలో సదుపాయాల బాధ్యత అప్పగించారు. ఆలయ ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, భక్తులు వేచి ఉండే ప్రాంతంలో సదుపాయాలు, రవాణా సౌకర్యాలపై భక్తుల్లో 37.7 శాతం మంది అసంతృప్తిగా ఉండటంతో ఈ మేరకు అదనపు విధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు పురోగతి సాధించాలని లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సమయపాలన లేని వృత్తి జర్నలిజం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమయపాలన లేని వృత్తి జర్నలిజం అని, నిద్రాహారాలేకుండా ప్రజాసేవలో నిమగ్నమైన జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, విజయవాడ ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం జరిగింది. దీన్ని ఎమ్మెల్యే ఉమా ప్రారంభించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కె బాబు, ఏపీయూడబ్ల్యూజే అర్బన్ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్కూల్స్ బ్యాగ్స్ కుట్టే షాపులో పనిచేసే యువకుడు అదృశ్యమైన ఘటన భవానీపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన షేక్ మహబూబ్ సుభాని ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్లో స్కూల్ బ్యాగ్స్ రిపేర్ షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ ఉదయం షాపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి స్కూటీ వేసుకుని వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. యువకుడు తల్లి రెహమాన్ బేగం అతను పనిచేసే షాపు వద్దకు వెళ్లి ఆరాతీసింది. సుభానీ షాపునకు రాలేదని యజమాని తెలిపారు. దీనిపై అతని తల్లి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై వారు కేసు నమోదు చేశారు.

ఆర్థోపెడిక్ సర్జరీలపై వర్క్‌షాపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎముక విరిగినప్పుడు దానికి శస్త్ర చికిత్స ఎలా చేయాలి, ఒకవేళ ఏదైనా ఇంప్లాంట్ వేయాల్సి వస్తే ఎలా అమర్చాలి అనే అంశాలపై శనివారం ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో వర్క్‌షాపు జరిగింది. ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సును తొలుత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులు ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన వైద్యులతో పాటు, 25 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాక్సిమల్ హ్యూమరస్ ఫ్రాక్చర్లకు సంబంధించిన తాజా చికిత్స పద్ధతులపై వినూత్న సమాచారాన్ని తెలియజేశారు. పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు శాస్త్రీయమైన అవగాహనకు ఇది దోహదపడుతుందని అధ్యాపకులు తెలిపారు.

ఈలప్రోలు రైల్వే ఎల్‌సీ గేటు తాత్కాలికంగా మూసివేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రాయనపాడు–కొండపల్లి మధ్యలోని రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు నంబర్ 140ని రెండు రోజుల పాటు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు విజయవాడ డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌సీ గేటు వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనుండటంతో ఈ నెల 14వ తేదీ ఉదయం 8 నుంచి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎల్‌సీ గేటును మూసివేయనున్నారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

కాపు రిజర్వేషన్‌కు మద్దతివ్వండి

ఆకులను కలిసిన సానా ప్రసాద్



భవానీపురం(విజయవాడపశ్చిమ): కాపులను బీసీలుగా గుర్తించాలని కోరుతూ చిత్తూరు నుంచి అమరావతి వరకు పాదయాత్ర చేస్తూ వస్తున్న ఏపీ బీసీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సానా ప్రసాద్ శనివారం కాపు ఉద్యమ నేత ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను భవానీపురంలోని ఆయన నివాసంలో కలిశారు. కాపు రిజర్వేషన్‌కు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. అనంతరం ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలవారు అత్యధికంగా పేద వర్గాలుగానే ఉన్నారని, వారని వెంటనే బీసీలుగా గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అల్లం పూర్ణ, రెడ్డిపల్లి సురేష్, పలువురు కాపు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థతను తెలియజేయండి


క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరించిన వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి ఇతర నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో చూపిస్తున్న అసమర్థతను వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రజలకు వివరించాలని ఆ పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ క్లస్టర్–1 సమావేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. క్లస్టర్ అధ్యక్షుడు బొండా నిరీష్ ఆధ్వర్యంలో చంద్రబాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ బాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ క్లస్టర్ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, క్లస్టర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ చంద్రబాబు గతంలో తప్పుడు హామీలు, తప్పుడు పత్రాలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ గడప గడపకూ వెళ్లి అమలు చేసిన సంక్షేమ పథకాలను చెబితే.. కూటమి నేతలు మాత్రం ఇంటింటికీ తిరిగి మోసపూరిత హామీలు అమలు చేస్తామని చెప్పి సంతకాలు చేసి బాండ్లు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారన్నారు. ప్రజల గడప వద్దకు వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్‌ని స్కాన్ చూపించి చంద్రబాబు ఇచ్చిన హామీలను, బాండ్ల గురించి, జగనన్న సంక్షేమ పథకాలను కూటమి పాలకులు ఎలా ఎగ్గొడుతున్నారో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు

హామీలు అమలుచేయని బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం శివాలయం సెంటర్ సుబ్బారాయుడు వీధిలోని కొనకళ్ల విద్యాధరరావు నివాసంలో శనివారం క్లస్టర్–3 అధ్యక్షుడు కేసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గ క్లస్టర్ – విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, క్లస్టర్–3 నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, వైఎస్ జగన్ విలేకరుల సమావేశాన్ని ప్రదర్శించారు. ఇంటింటికీ స్కానర్‌తో వెళ్లి ప్రజలతో ఆ క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేయించి కూటమి మోసాలను వివరించాలని కోరుతూ దానిని ఆవిష్కరించారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను, బాండ్ల గురించి, జగనన్న సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం ఏ విధంగా ఎగ్గొట్టిందో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్–3 నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కొండ దిగువన ఆధ్యాత్మిక వాతావరణం

పోలీసు, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి కొండ దిగువన ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుందామని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో ఛాంబర్‌లో శనివారం పోలీసు, దేవస్థాన ఇంజినీరింగ్, వైదిక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ వైపు నుంచి విచ్చేసే భక్తులు కొండపైకి చేరుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని ఈవో పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భక్తులు కొండపైకి చేరుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచన చేయాలన్నారు. ముఖ్యంగా టోల్‌గేట్ మార్పు చేయడం గురించి చర్చించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పార్కింగ్ పాయింట్, కనకదుర్గనగర్, దుర్గాఘాట్‌లో సమాచార కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏడీసీపీ జి.రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, దుర్గగుడి ఏసీ రంగారావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు, ఏఈఓలు రమేష్‌బాబు, తిరుమలేశ్వరరావు, వెంకటరెడ్డి, గంగాధర్, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

ముమ్మాటికి ప్రజాస్వామ్యంపై దాడే

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై కూటమి నేతల దాడి ముమ్మాటికీ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే భావించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. జిల్లా ప్రథమపౌరురాలిపైనే అధికార పార్టీకి చెందిన నేతలు ఈ విధమైన దాడి చేస్తే సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. కూటమి పాలనలో మహిళలపైనే కాకుండా బీసీ వర్గాలపైనా దారుణమైన దాడులు జరుగుతున్న విషయాన్ని ఘటనతో మరోసారి రుజువైందని తెలిపారు. ఇటువంటి ఘటనలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

ప్రపంచాన్ని మార్చే శక్తి యువతకే ఉంది



మాట్లాడుతున్న కేయూ వీసీ ఆచార్య కె.రాంజీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువతకు ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ అన్నారు. కేబీఎన్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే, ప్లేస్‌మెంట్ డే కార్యక్రమాలను శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. రాంజీ మాట్లాడుతూ చదువుని మించిన శక్తి ప్రపంచంలో లేదన్నారు. ప్రయత్నించడం మానుకోవడమే నిజమైన అపజయమని, పరాజయాలను సాకుగా చూపించి నిస్తేజంగా మారటం తగదని విద్యార్థులకు సూచించారు. యువత సాంకేతికత, కమ్యూనికేషన్, సృజనాత్మకతలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో యువత చేతుల్లోనే భవిష్యత్ ఉందని, వారి ఆలోచనలు, కార్యాచరణ దేశ దిశను మార్చగలవన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో 17 కోర్సుల్లో 579 పట్టాలు, ప్లేస్‌మెంట్ పరంగా 389 మంది డిగ్రీ విద్యార్థులకు, 124 మంది పీజీ విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపుపై సీపీఎం పోరుబాట

- మోదీ, అదానీల వద్ద మోకరిల్లిన కూటమి నేతలు
- సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి సత్యబాబు


భవానీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై అదనపు భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ సీపీఎం పశ్చిమ నగర శాఖ ఆధ్వర్యంలో పోరుబాట పట్టింది. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శనివారం భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. గృహ యజమానుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లను బిగించవద్దంటూ నినదించారు. సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నిలిపివేస్తామని గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చి, తర్వాత ఆ హామీని తుంగలో తొక్కారని మండిపడ్డారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ నేతలు ప్రధాని మోదీ వద్ద మోకరిల్లి స్మార్ట్ మీటర్ల బిగింపునకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు.

ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం

పవర్‌తో పెట్టుకున్నందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా 2002లో చంద్రబాబు పవర్ కోల్పోయినా ఇంకా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రం మొత్తంమీద రెండు కోట్ల విద్యుత్ మీటర్లను తొలగించి రూ.30వేల కోట్ల భారాలను మోపే స్మార్ట్ మీటర్లను బిగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రభుత్వాన్ని నిలదీశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలను మోపబోమంటూనే రూ.15,482 కోట్ల మేరకు అదనపు భారాలనుమోపి ప్రజల నడ్డివిరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఈవీ నారాయణ, ఎస్.సుబ్బారెడ్డి, ఎస్‌కే మస్తాన్, కృష్ణారెడ్డి, బి.అచ్చేశ్వరరావు, కోరాడ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెకు సమాయత్తమయ్యారని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ అన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ డంపింగ్ యార్డ్‌లో ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి సమ్మెలో చేపట్టాల్సిన విధివిధానాలపై శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ప్రమాద బీమాతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెబాట పడతారన్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు సమ్మెకు సహకరించాలని కోరారు.

క్రికెట్ ప్రీమియర్‌లీగ్ విజేతలకు బహుమతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ తోలుబొమ్మలాట ధాత్కర్ క్రికెట్ ప్రీమియర్‌లీగ్ పోటీలో కర్నూలు జిల్లా కోడూరుకు చెందిన జట్టు విన్నర్‌గా నిలిచింది.
అలాగే రన్నర్స్‌గా పల్నాడు జిల్లాకు చెందిన జట్టు నిలిచింది. మూడు రోజులుగా భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని బబ్బూరి గ్రౌండ్స్‌లో క్రికెట్‌లీగ్ పోటీలు జరిగాయి. శనివారం విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ జి. సమరం అన్నారు. శనివారం పటమట బెంజిసర్కిల్ సమీపంలోని ఆదిత్య కళాశాలలో రోటరాక్ట్ ఇన్‌స్టలేషన్ సెర్మనీ కార్యక్రమం జరిగింది. రోట్రాక్ట్ క్లబ్ ఆఫ్ ఆటోమా– రోట్రాక్ట్ క్లబ్ ఆఫ్ అరుణ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోట్రాక్ట్ ద్వారా సేవా దృక్పథంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. రోటరీ క్లబ్ విజయవాడ ప్రెసిడెంట్ బాలగోపాల్ మాట్లాడుతూ క్లబ్ సహకారంతో కార్యక్రమాలు చేయడానికి ముందుంటామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కొసిరెడ్డి వీర్రాజు మాట్లాడుతూ ఈ ఏడాది రక్తదానం, ప్లాస్టిక్ పై అవగాహన డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు సేవాభావం ప్రదర్శించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం నూతన ఆఫీస్ బేరర్స్‌గా కె.అభిషేక్, కె.లలిత అధ్యక్షులుగా ఎన్నికవ్వగా కార్యదర్శులుగా ఎం. రేణుక, సీహెచ్ అబ్బాస్ నియమితులయ్యారు. కార్యక్రమంలో రోటరాక్ట్ సెక్రటరీ రామ్ గోపాల్, సీడీఆర్‌సీ రాము, ఆర్‌పీసీ చైర్మన్ సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: బాలబాలికలలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని నాట్యాచార్యుడు ఉమామహేశ్వర పాత్రుడు అన్నారు. శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ప్రతిభకనపరచిన విద్యార్థినులు వెంకటేశ్వర, శివనంది, స్వర్ణ నంది పురస్కారాలు, సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణకు కళారత్న పురస్కారం అందుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమామహేశ్వర పాత్రుడు మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కళలను పరిరక్షించుకోవాలని సూచించారు. సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణను గురించి మాట్లాడుతూ ఆయనకు పురస్కారాలు, అవార్డులు కొత్త కాదన్నారు. శాస్త్రీయ సంగీతానికి జీవితం అంకితం చేశారన్నారు. వందలాది నృత్య కార్యక్రమాలకు గాత్ర సహకారం అందించినట్లు తెలిపారు. నాట్యాచార్యుడు ఘంటసాల పవన్‌కుమార్, మాగలూరి త్రినాథాచారి, కమర్షియల్ శాఖ అధికారి వీజీవీవీడీఎస్ కుమార్, నరసింహమూర్తి, ఆర్వీ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.